క్లుప్తంగా

రేపు ఉచిత శిక్షణ ఉపాధి మేళా

ఆత్మకూరు : దీన్‌దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌసల్య యోజన పథకంలో భాగంగా మంగళవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో స్థానిక యువతి, యువకులకు ఉచిత శిక్షణ, ఉపాధి మేళా నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. కంప్యూటర్ కోర్సు, స్పోకెన్ ఇంగ్లిష్, తదితర కోర్సులు నేర్పించనున్నట్లు తెలిపారు. నిరుద్యోగులను ఎంపిక చేసి వారికి శిక్షణ, ఉపాధి కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగులు వినియోగించుకోవాలని కోరారు. ఈ మేరకు ఉపాధి మేళా ఇన్‌చార్జ్ రాజేందర్ ఎంపీడీఓకు ఉపాధి వివరాల బ్రోచర్ అందించారు. ఈ శిక్షణ శ్రీ టెక్నాలజీస్ సంస్థ అందిస్తున్నట్లు తెలిపారు. ఐకేపీ ఏపీఎం లలిత పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ గీత కార్మికుడి మృతి



కమలాపూర్ : మండలంలోని శంభునిపల్లికి చెందిన జనగాని సుభాష్ (45) అనే గీత కార్మికుడు ప్రమాదవశాత్తు తాటి చెట్టుపై నుంచి పడి తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. గ్రామస్తులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. కుల వృత్తిలో భాగంగా సుభాష్ ఈనెల 20వ తేదీన సాయంత్రం తాటి చెట్టు ఎక్కి కల్లు తీస్తుండగా ప్రమాదవశాత్తు తాటి చెట్టుపై నుంచి జారి పడ్డారు. ఈ ప్రమాదంలో సుభాశ్‌కు తీవ్ర గాయాలు కాగా వెంటనే చికిత్స నిమిత్తం వరంగల్‌కు, అక్కడి నుంచి హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఆదివారం మృతిచెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు.

కేసు నమోదు

ఆత్మకూరు : ఇద్దరు మహిళలపై దాడిచేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని గుడెప్పాడ్‌కు చెందిన పరికి ప్రమీల, పరికి రమాదేవి రహదారి పక్కన చెత్తవేశారని శనివారం ఇంటి పక్కన ఉండే పరికి ప్రశాంత్ సదరు మహిళలపై దాడి చేసి గాయపర్చినట్లు ఆదివారం రమాదేవి భర్త పరికి రాజు ఫిర్యాదు మేరకు ప్రశాంత్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆర్మీ ఉత్తమ డాక్టర్ భిక్షపతికి సన్మానం



ఆత్మకూరు : ఆర్మీ ఉత్తమ డాక్టర్ లెఫ్టినెంట్ కల్నల్ డాక్టర్ మాచర్ల భిక్షపతిని మండల కేంద్రంలోని ఆదివారం ముదిరాజ్ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డాక్టర్ భిక్షపతి మాట్లాడుతూ.. యువత సన్మార్గంలో పయనించాలని సూచించారు. ప్రజలు దేశభక్తిని పెంపొందించుకోవాలని అన్నారు. రానున్న రోజుల్లో ఆత్మకూరు మండల ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు అందించే ప్రణాళిక రూపొందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ చైర్మన్ గుండెబోయిన భిక్షపతి, డైరెక్టర్ కుమారస్వామి, విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రవాద చర్యలను వ్యతిరేకించాలి

నర్సంపేట : అమాయక పౌరుల ప్రాణాలను తీసే ఉగ్రవాద చర్యలను తీవ్రంగా వ్యతిరేకించాలని తెలంగాణ రాష్ట్ర ప్రజాస్వామ్య వేదిక (టీఎస్‌డీఎఫ్) రాష్ట్ర బాధ్యులు నైనాల గోవర్ధన్, గుర్రం విజయ్‌లు పిలుపునిచ్చారు. ఈ మేరకు పట్టణంలోని ఓంకార్ భవన్‌లో టీఎస్‌డీఎఫ్ ఆధ్వర్యంలో ఆదివారం ఎంసీపీఐ (యూ), న్యూడెమోక్రసీ (చంద్రన్న వర్గం), రైతు ప్రజా సంఘాల సంయుక్త సమావేశం ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పహల్గాంలో పర్యాటకులపై విచక్షణారహితంగా ఉగ్రవాదులు జరిపిన దాడి హేయమన్నారు. పర్యాటకులకు తగిన భద్రత కల్పించడంలో విఫలమైన కేంద్రం పాకిస్తాన్‌పై దాడి చేసి ఎంతో సాధించామని గొప్పలు చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. పౌరుల ప్రాణాలకు భద్రత లేకుండా పోయిందన్నారు. ప్రజల్లో చైతన్యాన్ని కల్పించేందుకు పాలకులను మేల్కొల్పేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రజాస్వామిక వేదిక ప్రయత్నిస్తోందని, అందులో భాగంగా జూన్ 14వ తేదీన వరంగల్‌లో భారీ సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేశాన్ని రక్షించుకునేందుకు సమానత్వాన్ని పొందేందుకు ప్రజలు, ప్రజాస్వామిక వాదులు అధిక సంఖ్యలో తరలి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంసీపీఐ(యూ) నాయకులు గోనె కుమారస్వామి, ఎన్‌రెడ్డి హంసారెడ్డి, మంద రవి, నర్ర ప్రతాప్, సుంచు జగదీశ్వర్, సీపీఐ(ఎంఎల్) నాయకులు మోడెం మల్లేషం, న్యూడెమోక్రసీ నాయకులు రాచర్ల బాలరాజు, గంగుల దయాకర్, ఎలకంటి రాజేందర్, చంద్రన్న వర్గం నాయకులు సున్న అప్పారావు, మొగిలి ప్రతాప్‌రెడ్డి, జుబేర్ మహ్మద్, కాజా అస్లం, అబ్దుల్ సుభాన్, సోమిడి శ్రీనివాస్, ఊరటి హంసల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'కుయ్..కుయ్' సిబ్బందికి కష్టాలు

- అంబులెన్స్ సిబ్బందికి వసతి కరువు
- పట్టించుకోని అధికారులు, పాలకులు



వసతి సౌకర్యం కల్పించకపోవడంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వరండాలో సేద తీరుతున్న సిబ్బంది

శాయంపేట : ఆపద సమయంలో ఫోన్ కొడితే చాలు కుయ్.. కుయ్ మంటూ వచ్చే 108 అంబులెన్స్ సిబ్బందికి సౌకర్యాల లేమితో కష్టాలు తప్పడం లేదు. 6 నెలల క్రితం భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు 108 అంబులెన్స్ వాహనాన్ని కేటాయించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన 108 అంబులెన్స్ వాహనానికి డ్రైవర్, ఆరోగ్య సహాయకుడిని నియమించారు. కానీ వారికి వసతి కల్పించలేదు. దీంతో సిబ్బంది అంబులెన్స్‌లోనే భోజనం చేయాల్సిన పరిస్థితి నెలకొంది. 108 వాహనాన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని చెట్ల కింద నిలిపి ఆస్పత్రి వరండాలో సేదా తీరాల్సిన దుస్థితి నెలకొంది. అంబులెన్స్ సేవలు అందిస్తున్న డ్రైవర్, ఆరోగ్య సహాయకుడు ఇద్దరు ఎండలో ఉంటూ మలమూత్రాలకు, స్నానాలకు, విశ్రాంతి, భోజనానికి అనేక ఇబ్బందులు పడుతున్నారు.

రాత్రి సమయంలో పేషెంట్ల బెడ్లే గతి

ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఆస్పత్రిలో వైద్య సిబ్బంది విధులు నిర్వహించి వెళ్లిన అనంతరం అంబులెన్స్ సిబ్బంది ఆస్పత్రిలోని పేషంట్ల బెడ్స్‌పై నిద్రించాల్సిన పరిస్థితి నెలకొంది. రాత్రి సమయంలో వంట చేసుకుని భోజనం చేయాలంటే కోతుల బెడదతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రి సమయంలో ఏదైనా ప్రమాదం జరిగితే వెళ్లాలంటే అంబులెన్స్ చుట్టూ కోతులు ఉండడంతో ఇబ్బందులు పడుతున్నట్లు వారు వాపోతున్నారు. గతంలో 108 అంబులెన్స్ సిబ్బందికి వసతి కల్పించాలని పలువురు ఎంపీడీఓ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించినప్పటికీ ఎలాంటి స్పందన రాలేదు. ఇప్పటికైనా అధికారులు చొరువ చూపి 108 అంబులెన్స్ సిబ్బందికి వసతి కల్పించాలని మండల ప్రజలు కోరుతున్నారు.



అంబులెన్స్‌లోనే భోజనం చేస్తున్న సిబ్బంది

వసతి కల్పించాలి



మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన 108 అంబులెన్స్ సిబ్బందికి వసతి కల్పించపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సిబ్బంది సేదా తీరాలంటే ఆసుపత్రి వరండానే గత్యంతరం అవుతుంది. కోతుల బెడదతో సిబ్బంది అంబులెన్స్‌లోనే భోజనం చేయాల్సి వస్తుంది. అధికారులు వెంటనే వసతి కల్పించాలి.

– సాంబయ్య, (టీ) సీపీఐ, రాష్ట్ర సహాయ కార్యదర్శి

మల్లన్న ఆలయంలో మాససంక్రమణ పూజలు



రుద్రహోమం నిర్వహిస్తున్న అర్చకులు



పట్నం వేసి ఒగ్గు పూజలు చేస్తున్న పూజారులు

ఐనవోలు : మల్లికార్జునస్వామి ఆలయంలో మాస శివరాత్రిని పురస్కరించుకుని ఆదివారం అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, స్వామి వారి కల్యాణం, రుద్రహోమం, ఒగ్గు పూజారులచే పెద్ద పట్నం వేసి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఉప ప్రధాన అర్చకుడు పాతర్లపాటి రవీందర్, ముఖ్య అర్చకుడు మధుకర్‌శర్మ, వేద పండితులు గట్టు పురుషోత్తమశర్మ, విక్రాంత్ వినాయక్ జోషి, అర్చకులు సిబ్బంది పాల్గొన్నారు.

సైనిక్ స్కూల్‌కు విద్యార్థుల ఎంపిక



ప్రజ్వల్

ఆత్మకూరు : మండల కేంద్రంలోని సెక్రా హైస్కూల్ విద్యార్థి వడ్డేపల్లి ప్రజ్వల్ సైనిక్ స్కూల్‌కు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ సతీశ్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. ప్రజ్వల్‌ను పాఠశాల డైరెక్టర్లు సత్యనారాయణ, లక్ష్మణ్‌రెడ్డి, జ్ఞానేందర్‌రెడ్డి అభినందించారు.



ఆదిత్య

హనుమకొండ (దామెర) : మండలంలోని లాదెళ్ల గ్రామంలో వికాస్ హై స్కూల్ విద్యార్థి కొలనుపాక ఆదిత్య ఆల్ ఇండియా సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి ఆరో తరగతిలో అర్హత సాధించినట్లు పాఠశాల కరస్పాండెంట్ అక్బర్ తెలిపారు. సైనిక్ స్కూల్‌లో అర్హత సాధించిన విద్యార్థి ఆదిత్యను పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు అభినందించారు.

గ్రామకమిటీ ఎన్నిక

శాయంపేట : ప్రగతిసింగారం కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీని ఎన్నుకున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి ఆదివారం తెలిపారు. అధ్యక్షుడిగా కురాకుల రాజు, ఉపాధ్యక్షుడిగా మాదారపు అభిలాష్, ప్రధాన కార్యదర్శిగా మూలగుండ్ల సందీప్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చల్లా చక్రపాణి, పోలెపల్లి శ్రీనివాస్‌రెడ్డి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- పర్వతగిరి ఇన్‌స్పెక్టర్ రాజగోపాల్



మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ రాజగోపాల్

ఐనవోలు : మండలంలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పర్వతగిరి ఇన్‌స్పెక్టర్ రాజగోపాల్ కోరారు. ఆదివారం ఐనవోలు మండలంలోని నందనం గ్రామంలో జాగృతి కళా బృందంచే పలు అంశాలపై అవగాహన కల్పించారు. చదువు, రోడ్డు ప్రమాదాల నివారణ, బాల్యవివాహాల వలన కలిగే అనర్థాలు, డయల్ 100, సీసీ కెమెరాల ఆవశ్యకత, వృద్ధ తల్లితండ్రులను సరిగా చూసుకోవాలని, అలాగే మూఢనమ్మకాలపై మ్యాజిక్‌షోతో పాటు పలు సామాజిక అంశాలపై పాటల ద్వారా వివరించారు. అదే విధంగా సైబర్ క్రైమ్స్‌ను నాటిక ద్వారా ప్రదర్శించి 1930 సైబర్ హెల్ప్‌లైన్ గురించి వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. గుట్కా, గంజాయి తదితర నిషేధిత పదార్థాలు వాడుతున్నట్లు అనుమానం వస్తే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు. ఇటీవల వాట్సాప్‌లో వచ్చే లింక్‌లను ఓపెన్ చేసి అనేక మంది డబ్బులు పోగొట్టుకుంటున్నారని, తెలియని లింక్‌లను క్లిక్ చేయొద్దని అన్నారు. అలాగే గేమింగ్ యాప్ జోలికి వెళ్లొద్దని అన్నారు. సుమారు 250 మందికి పైగా ప్రజలు, కళాబృందం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఎల్కతుర్తి : పూర్వ విద్యార్థుల గ్రూప్ ఫొటో



కమలాపూర్‌లో..



వేలేరులో..

ఎల్కతుర్తి : మండలంలోని జీల్గుల గ్రామంలో గల ప్రభుత్వ ప్రాథమిక ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరిగింది. 2003-04 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులంతా ఒకే వేదికపై కలుసుకుని ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. అలనాటి మధుర జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలతో రోజంతా ఉల్లాసంగా గడిపారు. విద్యార్థులు ఆయా రంగాల్లో స్థిరపడిన వారిని చూసి గురువులు ఆనందపడ్డారు. అనంతరం విద్యార్థులు గురువులను శాలువాతో సత్కరించి జ్ఞాపికలు అందించారు. అనంతరం అందరూ కలిసి సహపంక్తి భోజనం చేశారు. కొంత సమయంలో ఆడిపాడారు. గ్రూపు ఫొటోలు, సెల్ఫీలు దిగి ఉత్సాహంగా గడిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్‌రావు, సత్యలక్ష్మి, విద్యార్థినీలు స్రవంతి, శ్రీలత, తిరుమలతో పాటు తదితరులు పాల్గొన్నారు.

వేలేరు : మండల కేంద్రంలోని జెడ్పీఎస్ఎస్ పాఠశాలలో 1991-92 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. సుమారు 35 సంవత్సరాల తర్వాత కలిసిన స్నేహితులు ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. అలనాటి మధుర జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. రోజంతా సాంస్కృతిక కార్యక్రమాలతో ఉల్లాసంగా గడిపారు. తమకు విద్యాబోధన చేసిన గురువులను శాలవాతో సత్కరించి జ్ఞాపికలు అందించారు. అనంతరం ఉపాధ్యాయులు, విద్యార్థులంతా కలిసి భోజనం చేశారు. ఉపాధ్యాయులు రాజన్న, రాజారెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, రామచంద్రరెడ్డి, గఫార్, స్వామి, వాణిదేవి, మల్లయ్య, ఆగయ్య, అరుణాదేవి తదితరులు పాల్గొన్నారు.

కమలాపూర్ : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1995-96 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థులు స్థానిక ఉమామహేశ్వర ఫంక్షన్ హాల్‌లో ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా తమతో చిన్ననాట చదువుకున్న బాల్య మిత్రులను కలుసుకుని ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని కుశల ప్రశ్నలు వేసుకుని యోగ, క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. బాల్య స్మృతులను, నెమరేసుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆటపాటలతో ఉల్లాసంగా గడిపారు. చిన్ననాట తమకు విద్యాబుద్ధులు నేర్పిన అప్పటి హెచ్‌ఎం సుఖదేవ్, ఉపాధ్యాయులు రాంభాస్కర్‌రాజు, రాజమౌళి, శ్రీనివాసరావు, డేవిడ్, నారాయణ, ఎడ్వర్డ్ తదితరులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సంపత్, కుమారస్వామి, శ్రీనివాస్, కిరణ్‌కుమార్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

ఫొటో గ్రాఫర్ కుటుంబానికి ఆర్థికసాయం

పరకాల : అనారోగ్యంతో మృతిచెందిన ఫొటో గ్రాఫర్స్ కుటుంబాలకు ఫొటో గ్రాఫర్స్ అసోసియేషన్ అనునిత్యం అండగా ఉంటుందని అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గాదె లింగమూర్తి అన్నారు. నడికూడ మండలం నార్లాపూర్ గ్రామానికి చెందిన శనిగరపు శ్రీకాంత్ అవుట్ డోర్ ఫొటో గ్రాఫర్ (ఉమ్మడి జిల్లా శాశ్వత సభ్యుడు) మృతిచెందగా ఆయన భార్య జన్ను ప్రవళికు రూ.60వేల చెక్కును లింగమూర్తి చేతుల మీదుగా అందించారు. ఉమ్మడి వరంగల్ జిల్లా ఫొటో, వీడియో గాఫర్స్ సంక్షేమ సంఘం కార్యనిర్వహక అధ్యక్షుడు సునీల్‌కుమార్, ప్రధాన కార్యదర్శి పెరురు మల్ల దయాకర్, కోశాధికారి వెన్నం సత్యనారాయణతో పాటు పరకాల డివిజన్ బాధ్యులు పాల్గొన్నారు.

పెద్దాపూర్‌లో చోరీ



ఆత్మకూరు : మండలంలోని పెద్దాపూర్ గ్రామంలో శనివారం రాత్రి ఓ ఇంట్లో దొంగలు చోరీకి పాల్పడ్డారు. సీఐ సంతోశ్ తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దాపూర్ గ్రామానికి చెందిన చీకటి పద్మ శనివారం రాత్రి ఇంటికి తాళం వేసి బంధువుల వద్దకు వెళ్లి ఆదివారం తెల్లవారుజామున వచ్చేసరికి తాళం తీసి ఉండి ఇంట్లోని వస్తువులు చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. పూర్తిగా పరిశీలించగా ఇంట్లో ఉన్న 0.8 గ్రాముల బంగారు ఆభరణాలు, ఒకటిన్నర కిలోల వెండి ఆభకరణాలు కనిపించలేదు. దీంతో బాధితురాలు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. సిబ్బందితో కలిసి బాధితురాలు ఇంటిని పరిశీలించి వివరాలు సేకరించినట్లు పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సంతోశ్ వెల్లడించారు.

చోరీకి యత్నించిన వ్యక్తి అరెస్ట్

వేలేరు : మండలంలోని పీచరలో ఓ ఇంటిలో చోరికి యత్నించిన భీమదేవరపల్లి మండలం మల్లారం శివారు పెద్దతండాకు చెందిన గుగులోతు సుమన్‌పై కేసు నమోదు చేసినట్లు వేలేరు ఎస్సై సురేశ్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. పీచర గ్రామానికి చెందిన ఎడపల్లి ప్రశాంత్ ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తి ఇంట్లోకి ప్రవేశించినట్లు గుర్తించిన ప్రశాంత్ చాకచక్యంగా వ్యవహరించి చుట్టుపక్కల వారి సహాయంతో దొంగను పట్టుకుని పోలీసులకు అప్పగించాడు.

ముదిరాజ్‌లకు ప్రాధాన్యం కల్పించాలి

- మెపా వ్యవస్థాపక అధ్యక్షుడు దేవేందర్



మాట్లాడుతున్న పులి దేవేందర్

హనుమకొండ (దామెర) : ముదిరాజ్‌లకు ప్రాధాన్యం కల్పించాలని ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (మెపా) వ్యవస్థాపక అధ్యక్షుడు పులి దేవేందర్ అన్నారు. మండల కేంద్రంలో మెపా ముఖ్యకార్యకర్తల సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యా, ఉపాధి అవకాశాల్లో ముదిరాజ్‌లకు అన్యాయం జరుగుతోందని అన్నారు. రాష్ట్ర జనాభాలో అధిక శాతం ముదిరాజ్‌లు ఉన్నప్పటికీ అన్ని రంగాల్లో అనిచివేతకు గురౌతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముదిరాజ్‌ల హక్కుల సాధనకు ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఆలేటి ప్రవీణ్, ప్రధాన కార్యదర్శిగా పిట్టల అరవింద్, ఉపాధ్యక్షులుగా సానబోయిన కిరణ్, సందీప్, ప్రదీప్, కోశాధికారిగా వెంకటేశ్, కార్యవర్గ సభ్యులుగా సాత్విక్, హేమంత్, వెంకటేశ్, అభిలాష్, గణేశ్, దీనేశ్‌ను ఎన్నుకున్నారు. సమావేశంలో రాష్ట్ర సలహాదారులు పులి ప్రభాకర్, రాష్ట్ర కార్యదర్శి నీరటి రాజ్, జిల్లా అధ్యక్షుడు రాజేశ్, సొసైటీ మాజీ డైరెక్టర్లు పిట్టల మొగిలి, లింగమూర్తి పాల్గొన్నారు.

గొల్ల, కురుమలకే చైర్మన్ పదవి ఇవ్వాలి



మాట్లాడుతున్న లింగయ్య

వేలేరు : మండలంలోని గట్టు మల్లన్న ఆలయ దేవస్థాన చైర్మన్ పదవి గొల్ల, కురుమలకే ఇవ్వాలని గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కాడబోయిన లింగయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో సంఘం మండల సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొన్నేళ్లుగా గట్టు మల్లన్న ఆలయ చైర్మన్‌గా గొల్లకురుమలకు అవకాశం ఇవ్వకుండా రాజకీయ పార్టీలు మోసం చేశాయని ఆరోపించారు. అలాగే గ్రామాల్లో ప్రభుత్వ భూములను, చెరువు గట్లపై ఉన్న తుమ్మ చెట్లను గొర్రెల కాపరుల సొసైటీకి ఇవ్వాలని కోరారు. కొన్ని గ్రామాల్లో చెరువు గట్లపై ఉన్న తుమ్మ చెట్లను కొంతమంది వ్యాపారులు తొలగించి అమ్ముకుంటున్నా అధికారులు చోద్యం చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం గొర్రెల మేకల పెంపకదారుల సంఘం మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మండల సంపత్‌కుమార్, ఉపాధ్యక్షులుగా బండి చిలుక రాజు, శ్రావణ్, ప్రధాన కార్యదర్శి బంక శ్రీనివాస్, సహాయ కార్యదర్శిగా వంగ మహేష్‌ను ఎన్నుకున్నారు. సంఘం నాయకులు శ్రీకాంత్, భిక్షపతి, రాజయ్య, సంపత్, ఓదేలు, హరీశ్ పాల్గొన్నారు.

రేణుకా ఎల్లమ్మ ఆలయ నిర్మాణానికి కృషి

- కుడా చైర్మన్ వెంకట్రామ్‌రెడ్డి



ఇనగాలను కలిసిన గౌడ సంఘం పెద్దలు

ఆత్మకూరు : మండల కేంద్రంలో నిర్మించనున్న రేణుకా ఎల్లమ్మ కంఠమహేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి కృషి చేస్తానని కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి అన్నారు. ఆత్మకూరు గౌడ సంఘం పెద్దలు హనుమకొండలోని ఆయన నివాసంలో ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి ఆలయ నిర్మాణం గురించి వివరించారు. ఆలయ నిర్మాణానికి సహకరించాలని వెంకట్రామ్‌రెడ్డిని కోరగా ఆయన సానుకూలంగా స్పందిస్తూ తన పుట్టిన ఊరులో నిర్మిస్తున్న ఆలయానికి తన వంతు సహకరం అందిస్తానని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. ఆలయ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని సూచించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు పాల్గొన్నారు.

పరకాలలో తిరంగా యాత్ర



పట్టణంలో చేపట్టిన తిరంగా యాత్ర

పరకాల : కాశ్మీర్‌లోని పహల్గమ్‌లో 26 మంది అమాయక ప్రజలను (25 మంది భారతీయులతో పాటు నేపాల్ పౌరుడు ఒకరు) పొట్టనబెట్టుకున్న ఉగ్రవాదులపై ప్రతీకారంగా భారత్ ఆపరేషన్ సిందూర్ పేరిటా పాకిస్తాన్‌పై దాడి చేసి 200 మంది ఉగ్రవాదులను హతమార్చిన విషయం తెలిసిందే. కాగా ఆదివారం పరకాల ప్రజలు జాతీయ జెండాల ప్రదర్శన (తిరంగ్ యాత్ర) నిర్వహించారు. జాతీయ చైతన్య మహిళ వేదిక ఆధ్వర్యంలో పోచమ్మగుడి నుంచి అమరధామం వరకు జరిగిన ర్యాలీలో ప్రముఖులు, వ్యాపారస్తులు, మేధావులు, బీజేపీ నాయకులు, వైద్యులు, యువకులతో పాటు చిన్నారులు జాతీయ జెండాతో జైభారత్.. జైజవాన్ అంటూ నినాదాలు చేశారు. అమరధామం వద్దకు చేరుకుని పహల్గమ్ ఘటనలో మృతిచెందిన వారికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జాతీయ చైతన్య మహిళ వేదిక పరకాల కన్వీనర్ వంగర సుమలత, ప్రముఖ వైద్యులు డాక్టర్ పి.కాశీప్రసాద్, డాక్టర్ సిరంగి సంతోశ్‌కుమార్, డాక్టర్ పి.రాజేశ్వర ప్రసాద్, డాక్టర్ ఎం.రజనీకాంత్, నారి శక్తి మనులు జగతి, దార్న మీనాక్షి, ప్రీతి, హిమాలయాతో పాటు శ్రీనివాస్‌రెడ్డి, సతీశ్, రమేశ్, నాగరాజు, రఘు, మాజీ ఆర్మీ జవాన్, యువకులు, పట్టణ వాసులు తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా ఓపెన్ జిమ్ పరికరాలు



తుప్పు పడుతున్న జిమ్ పరికరాలు

వేలేరు : ప్రజలు వ్యాయామం చేసేందుకు మండల కేంద్రంలో వీలుగా గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రూ.4.50 లక్షల వ్యయంతో పాఠశాల ఆవరణలో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేశారు. కొన్ని రోజులు వాటి నిర్వహణ బాగానే ఉన్నప్పటికీ ఆ తర్వాత నుంచి జిమ్‌ను పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. దీంతో జిమ్ పరికరాలు తుప్పు పట్టి పాడవుతున్నాయి. కొన్ని పరికరాలు విరిగిపోయాయి. దీంతో ఓపెన్ నిరుపయోగంగా మారడంతో స్థానికులు ఆసక్తి చూపడం లేదనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. అధికారులు స్పందించి ఓపెన్ జిమ్‌ను బాగుచేయించి వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీ



శాయంపేట : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమీపంలో రోడ్డు మధ్యలో మిషన్ భగీరథ మెయిన్ పైపులైన్ లీకేజీ అవడంతో నీరు వృధాగా పారుతుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని మిషన్ భగీరథ ట్యాంక్‌కు సరఫరా అయ్యే పైప్‌లైన్ లీకేజీ అయ్యిందని అధికారులు పట్టించుకోవడం లేదనే స్థానికులు ఆరోపిస్తున్నారు.